క్లుప్తంగా

28 నుంచి ఉపవాస కూడికలు

దెందులూరు: కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఈ నెల 28, 29, 30, 31 తేదీల్లో రక్షణ సైన్యం కొవ్వలి చర్చి కోర్ ఆఫీసర్ మేజర్ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో ఉపవాస కూడికలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివిజనల్ కమాండర్ జె.మోషే, కె.మేరికుమారి విచ్చేస్తారని సుబ్బారావు అన్నారు.

మిథున్‌రెడ్డిని కలిసిన డీబీఆర్‌కే చౌదరి

దెందులూరు: పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం దెందులూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు డీబీఆర్‌కే చౌదరి తదితరులు మిథున్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఆయనకు వివరించినట్టు డీబీఆర్‌కే చౌదరి తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

దెందులూరు: ఏలూరు డివిజన్‌లో 14,500 ఈ-క్రాప్ నమోదు లక్ష్యమని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. బుధవారం కొవ్వలిలో వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్న ఈ-క్రాప్ నమోదు వివరాలను, విధానాలను పరిశీలించారు. రైతుల నుంచి వ్యవసాయ శాఖ సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని మండలాల్లో వ్యవసాయ శాఖ లక్ష్యాలకు అనుగుణంగా మండల వ్యవసాయ శాఖాధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేస్తామన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది వివరాలకు వచ్చినప్పుడు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన రైతులను కోరారు.

ఇంటింటా ప్రత్యేక సర్వే ప్రారంభం

దెందులూరు: గ్రామగ్రామాన ఎన్నికల ప్రత్యేక సర్వే 2025 ప్రారంభించామని, దెందులూరు తహసీల్దార్, ఎలక్టోరల్ బి.సుమతి బుధవారం వీరమాచినేని శివాజీ ఇంట్లో సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, ఇంటింటా సర్వే చేస్తారని, చనిపోయిన వారు మార్పులు, చేర్పులు, బదిలీ, ఇతర అన్ని వివరాలను బీఎల్‌ఓలు అడిగి తెలుసుకుని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఫారం- 6, 7, 8లో వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వోలు అనిరుధ్, శ్రీనివాస్ ఉన్నారు.

వృద్ధులను ఆదరించాలి

దెందులూరు: వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరిస్తూ, ప్రేమ, ఆప్యాయతతో శ్రద్ధగా చూసుకోవాలని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. బుధవారం నర్సింగ్ కళాశాలలో జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు వృద్ధులకు పాదపూజ చేసి వస్త్రాలు, పండ్లు అందజేశారు.

మట్టి నమూనాల సేకరణ

దెందులూరు: వ్యవసాయ జిల్లా అధికారుల మేరకు బుధవారం దెందులూరులో మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రమేష్ మట్టి నమూనా సేకరించారు. రైతు పేరు, పొలం, విస్తీర్ణం, సేకరించిన మట్టి తేది, వివరాలను యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందని అగ్రికల్చరల్ విలేజ్ అసిస్టెంట్ రమేష్ అన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది సేకరించిన మట్టి నమూనాలను కృష్ణా జిల్లా గొల్లపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి పంపిస్తామన్నారు. పరీక్షలు అనంతరం వచ్చిన నివేదికను రైతులకు వివరించి నివేదిక అనుగుణంగా వాడకాన్ని తెలియజేస్తామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

ఉంగుటూరు: ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమలు రావని మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. బుధవారం రావులపర్రులో డ్రైడేలో భాగంగా అమలవుతున్న కార్యక్రమాలు పరిశీలించారు. సిబ్బందిని వెంట వేసుకుని ఇంటింటికీ వెళ్లి దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లక్ష్మణరావు సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి కె. శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకుడు సత్యనారాయణ,ఆరోగ్య కార్యకర్తలు శాంతిప్రియ, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి పాఠశాలలో ఎంఈఓ తనిఖీ

పెదపాడు: అప్పనవీడు ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలను ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలోని రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ మాధవీలత పాల్గొన్నారు.

వరద కష్టాలు.. ఖరీఫ్ సాగులో భిన్న దృశ్యాలు



వాకపల్లిలో సార్వా పైరుకు మొదటి దఫా ఎరువు వేస్తున్న రైతులు



గణపవరంలో వరినాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసిన దృశ్యం



పిప్పరలో నారు తీస్తున్న రైతులు

- వరి సాగులో కానరాని సారూప్యత
- పైరు కుళ్లిన చోట్ల మరలా సాగు చేపట్టిన రైతులు
- నారు తెచ్చి వరి నాట్లు వేస్తున్న వైనం

గణపవరం: సాధారణంగా ఏ పంట కాలంలోనైనా వరి సాగులో సారూప్యత కనిపిస్తుంది. రైతులంతా దాదాపు ఏక కాలంలో వ్యవసాయ పనులు చేస్తుంటారు. ముఖ్యంగా ఒకే గ్రామంలో, ఒకే ఆయకట్టులో వ్యవసాయ పనులు దాదాపు ఒకేలా సాగుతుంటాయి. వారం రోజుల వ్యవధిలో నారుమళ్లు వేయడం, పొలాలు దమ్ము చేయడం, వరినాట్లు వేయడం, కోతలు కోయడం, మాసూళ్లు చేయడం వంటి పనులు ఏకకాలంలో జరుగుతుంటాయి. అయితే ప్రస్తుత ఖరీఫ్ వ్యవసాయం దీనికి భిన్నంగా సాగుతోంది. ఒకే ప్రాంతంలో ఒకే ఆయకట్టులో భిన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా మండలంలో దాదాపు 75శాతం సారా నాట్లు వేసిన పొలాలు ముంపుబారిన పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు రోజుల్లో ముంపునీరు బయటకు పోవడంతో వరిపైరు సస్యరక్షణ చర్యలతో బతికి బట్టకట్టింది. మరి కొన్ని ప్రాంతాల్లో వారం నుంచి పదిరోజుల వరకూ పైరు ముంపులోనే ఉండటంతో వరినాట్లు కుళ్లిపోయాయి. ఇలాంటి చోట్ల రైతులు మళ్లీ నారు మడులు వేయగా, కొందరు రైతులు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి, బయటి జిల్లాల నుంచి నారు తెచ్చుకుని నాట్లు వేశారు. దీనితో గణపవరం మండలంలో సార్వా సాగు వివిధ రకాలుగా సాగుతోంది. మండలంలో మొత్తం 14 వేల ఎకరాల్లో సార్వా సాగు చేస్తున్నారు. ఎ.గోపవరం, అర్ధవరం, మగ్గుల్ల, వాకపల్లి, వల్లూరు, చిలకంపాడు, కాశిపాడు, వీరేశ్వరపురం తదితర గ్రామాల్లో సార్వా పైరు వరద బారి నుంచి త్వరగా బయటపడటంతో ఆ గ్రామాల్లో సుమారు నాలుగువేల ఎకరాల్లో పైరు దుబ్బుచేసి, ఏపుగా పెరుగుతోంది. దీనితో రైతులు మొదటి విడత ఎరువుల కోటా పైరుకు అందిస్తున్నారు. గణపవరం, కోమర్రు, మొయ్యేరు, డికెవల్లి గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. నారుతీయడం, నాట్లు వేయడం కార్యక్రమాల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఒకే ఆయకట్టులో కొందరు రైతులు పైరుకు మొదటి విడత ఎరువులు వేస్తుంటే ఆ పక్కనే ఇంకా నాట్లు వేస్తున్న పొలాలు, నాట్లు వేయడానికి దమ్ము చేసి సిద్ధం చేసిన పొలాలు దర్శనం ఇస్తున్నాయి. మరోచోట వరినాట్లు వేస్తుంటే, ఆ ఆయకట్టులోనే మరోచోట నారుమడులు రెండుమూడు అంగుళాలు ఉంటే ఆ పక్కనే చేను మురగ దమ్ములు జరుగుతున్నాయి. ఇలా ఒకే ప్రాంతంలో సాగు విభిన్న దశలలో సాగుతుండటం గతంలో ఎప్పుడూ చూడని విశేషంగా చెబుతున్నారు. గత నెలలో సార్వా నాట్లు వేసిన సమయంలో భారీ వర్షాలు, వరదల కారణంగా కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.

వారం రోజుల్లో నాట్లు పూర్తి



గణపవరం మండలంలో ఇంకా ఐదు వందల ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉంది. కొత్తపల్లి, సరిపలె, గణపవరం ఆయకట్టు పొలాల్లో వరి నాట్లు ప్రారంభించారు. ఇటీవల రెండోసారి నాలుగువేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. రైతులు ఇతర ప్రాంతాల నుంచి నారు తెచ్చుకుని నాట్లు వేయడం వల్ల సమయం ఆదా అవుతోంది.

–యర్రంశెట్టి ప్రసాద్ ఏవో, గణపవరం

పంచాయతీల్లో మెరుగైన పాలనకు శిక్షణ దోహదం

భీమడోలు: గ్రామ పంచాయతీల్లో సమర్థవంతమైన పరిపాలను అందించేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రణాళికల తయారీ, తడి, పొడి వ్యర్థాల నిర్వహణ తదితరులపై మూడు రోజుల పాటు సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ ఏ.సుందరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సోర్స్‌పర్సన్లు ముత్తయ్య, వెంకటరావు, సోమరాజు, విజయకుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీపై గ్రామ సభలు

దెందులూరు: దెందులూరు మండలంలో ఈ నెల 23న ఉపాధి హామీపై గ్రామ సభలు దెందులూరు ఎంపీడీఓ వి.శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఉపాధి హామీ మండల ఏపీఓ దశరథ రామ్‌జీ తెలిపారు. పోతునూరు, దోసపాడు గ్రామానికి ఈఓఆర్‌డీ స్వామిని గ్రామ కార్యదర్శి షరీఫ్‌ను నియమించారు. పోతునూరులో ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు దోసపాడులో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. కొత్తగూడెం, కొవ్వలిలో ఏఈటీఆర్ జి.చౌదరిని గ్రామ కార్యదర్శులు ఆదిలక్ష్మి, రంగ నాయకమ్మను నియమించారన్నారు. కొత్తగూడెంలో ఉదయం 10, కొవ్వలిలో మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. సోమవరప్పాడు, గోపన్నపాలెంలో పశువైద్యశాఖ మండల వైద్యాధికారి రామ్మోహన్, కార్యదర్శి స్టాలిన్‌బాబును నియమించారన్నారు. గోపన్నపాలెంలో ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. సానిగూడెం, గంగన్నగూడెంలో హౌసింగ్ ఏఈ ఎస్.కావ్య, శ్రీలక్ష్మి, గ్రామ కార్యదర్శులు కిషోర్, ఆనంద్‌కుమార్‌ను అధికారులను నియమించారు. సానిగూడెంలో ఉదయం 10 గంటలకు, గంగన్నగూడెంలో మధ్యాహ్నం 2 గంటలకు సభలు నిర్వహిస్తామన్నారు. గాలాయగూడెం, జోగన్నపాలెంలో ఏఓ గద్దె రమేష్, కార్యదర్శి బాచీ, ఆనంద్‌కుమార్‌ను నియమించారు. గాలాయగూడెంలో ఉదయం 10 గంటలకు, జోగన్నపాలెంలో మధ్యాహ్నం 2 గంటలకు, చల్లచింతలపూడి, పెరుగ్గూడెం గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్రప్రసాద్, ఆనందకుమార్, సుమలతను నియమించారు. చల్లచింతలపూడిలో ఉదయం 10 గంటలకు, పెరుగ్గూడెం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. మేధినరావుపాలెం, ముప్పవరం గ్రామాలకు ఈసీ దుర్గాప్రసాద్, కార్యదర్శి ప్రేమకుమార్‌ను నియమించారు. మేధినరావుపాలెంలో ఉదయం 10 గంటలకు, ముప్పవరంలో మధ్యాహ్నం 2 గంటలకు సభలు నిర్వహిస్తామన్నారు. దెందులూరుకు ఏపీఓ రామ్‌జీ, కార్యదర్శి విజయలక్ష్మిని నియమించారు. ఉదయం 10 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. రామారావుగూడెం, శ్రీరామవరం గ్రామ సభలకు ఎంఈఓ వరప్రసాద్, కార్యదర్శి రామదాసు, చౌదరిని నియమించారు. రామారావుగూడెం ఉదయం 10 గంటలకు, శ్రీరామవరంలో మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ సభ జరుగుతుందని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు సమావేశానికి హాజరుకావాలని ఏపీఓ రామ్‌జీ కోరారు.

దోసపాడు పేదలకు న్యాయం చేయాలి



చెరువు వద్దకు వెళ్తున్న దళితులను వారిస్తున్న ఎస్సై కె.స్వామి

దెందులూరు: జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అసలైన అసైన్డ్‌దారులకు భూమి అప్పగించాలని దోసపాడులో దళితులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం చేయాలి, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు పేదల చెరువుల వద్దకు వెళ్తున్నవారికి పోలీసులు అడ్డుకున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు భూస్వాములకు కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాలు ఇప్పటి వరకు పాటించకపోవడమేమిటని ప్రశ్నించారు. పేదలకు అనుకూలంగా తీర్పు వచ్చినా ఆయా శాఖల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శించారు.

ప్రతి ఒక్కరిపై మానవత్వాన్ని చూపాలి



భీమడోలులో రోగులకు పోష్టికాహారాన్ని అందిస్తున్న రామిశెట్టి గంగాధరరావు, సునీత

భీమడోలు: ప్రతి ఒక్కరి పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలి జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన రోగులకు, పిల్లలు, బాలింతలుకు పోష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సమాజాన్ని స్థాపించడంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ సునీత, జిల్లా కోశాధికారి పసుపులేటి సాంబశివరావు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, ఆడిట్ కన్వీనర్ జి.రమణ శంకర్, పెద్దలు కీళ్ల పాండురంగారావు, వైద్యులు పాల్గొన్నారు.

ప్రధాని పిలుపుతో పాఠశాలల్లో శుభతిథి భోజనం



తిమ్మయ్యపాలెంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: ప్రధానమంత్రి పిలుపుతో తిమ్మయ్యపాలెంలో తొంటా రాజేష్ తన కుమారుడు చేతన్ పేరున బుధవారం పాఠశాలలో శుభతిథి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆ గ్రామ ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధర్మరాజు హాజరై భోజనాలు చేశారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన తొంటా రాజేష్‌ను అభినందించారు. కూటమి నాయకులు పాతూరి విజయ కుమార్, కడియాల రవిశంకర్ పాల్గొన్నారు.

శీతారామపురం ప్రజల దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: శీతారామపురంలో మంచినీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తన లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్రస్టు ద్వారా మంచినీటి ట్యాంకరును పంపించారు. దాంతో ప్రజలు బిందెలతో నీరుపట్టుకుని అవసరాలు తీర్చుకున్నారు.

రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర



భీమడోలు జంక్షన్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న మాలల పోరాట యోధుల జేఏసీ నాయకులు

భీమడోలు: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు వర్గీకరణ అంశాన్ని ముందుకు తెచ్చి కుట్ర చేస్తుందని జేఏసీ నాయకులు విమర్శించారు. మాలల పోరాట యోధుల సంఘం మండల జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం తలపెట్టిన భారత్ బంద్ భీమడోలు మండల వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలను జేఏసీ నాయకులు మూసి వేయించారు. అనంతరం భీమడోలులో ర్యాలీ చేశారు. జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌పై జేఏసీ నాయకులు, ఇతర గ్రామాల నుంచి బైక్‌లపై వచ్చిన వారంతా రహదారిపై ధర్నా చేశారు. మాలల పోరాట యోధులు జిల్లా నాయకులు, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, జిల్లా నాయకులు గోగులమూడి రవికుమార్, అంబటి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ పాము మాన్‌సింగ్, ఎంపీటీసీ ఇంజేటి జూనియర్, నాయకులు కూరపాటి రవి వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్నదమ్ములుగా ఉన్న మాల, మాదిగలను విడదీసి చిచ్చుపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తీసుకుని వచ్చిందన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బంద్

ఉంగుటూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నారాయణపురంలో మాలమహానాడు యువకులు ఆందోళన చేశారు. నారాయణపురం, చేబ్రోలులోని ప్రభుత్వ పాఠశాలలను, కార్యాలయాలను ఎస్సీ యువకులు మూయించి వేశారు.

దెందులూరులో బంద్

దెందులూరు: భారత్ బంద్‌లో భాగంగా బుధవారం దెందులూరు మండలంలోని కొవ్వలిలో గొల్ల వీరాస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ ఆధ్వర్యంలో బంద్ కొనసాగింది. ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. నాయకులు కొంగ రత్నకుమార్ అబ్బాస్, మేడిది రితివి, తోట అజిత్ బ్యాంకు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

పంటల సస్యరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పెదకడిమిలో పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

పెదవేగి : వరి పంటను ఆశించే పురుగులు తెగుళ్ల వాటి నివారణపై రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాఖాధికారులు బుధవారం పెదవేగి మండలం పెదకడిమిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు ఏరువాక కేంద్రం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ రమణ, డాక్టర్ నాగేంద్ర బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామ రైతులతో కలిసి వరి పంట పొలాలను పరిశీలించారు. పంటలపై ప్రస్తుత సీజన్‌లో ఆశించే తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ఈ- పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధి కార్యాలయ ఏడీఏలు శైలజ, మహిళ రైతులకు వివరించారు. ఈ- పంట యాప్‌లో పంటల నమోదు వివరాలను వ్యవసాయ ఉద్యానవన పంటల శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండల వ్యవసాయాధికారి ప్రియాంక, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వ్యవసాయ,ఉద్యాన శాఖల సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం కృషి

నిడమర్రు: ప్రపంచ శాంతికోసం ప్రభుత్వాలు కృషి చెయ్యాలని మానవత సంస్థ జిల్లా సమన్వయకర్త నౌడు వెంకట అచ్యుతరామారావు అన్నారు. బుధవారం మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవంగా బావాయిపాలెంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు ప్రపంచ శాంతిని కోరుతూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుత రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు శాంతి ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యదర్శి నిమ్మల దొరబాబు, ట్రెజరర్ కాన్వెంట్ శ్రీను, ఈసీ మెంబరు చిన్న సత్యనారాయణ, పవన్, విశ్వనాథరాజు, బాలాజీ సురేష్ తదితరులున్నారు.

పశువులకు టీకాలు

పెదపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానంలో పశువులు పశువుల పాత్ర ఎంతో ఉందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడ, రాజుపేట, గోగుంట గ్రామాల్లో మీకోసం మీ చింతమనేని కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం పశువులకు గాలి కుంటు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం పట్ల పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తా అనీల్, వెటర్నరీ డాక్టరు డాక్టరు వాణీ సంధ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలి



నిడమర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, స్కీమ్ వర్కర్స్



వంగూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు

నిడమర్రు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణ డిమాండ్ చేశారు. బుధవారం కలకత్తాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సీఐటీయూ, స్కీమ్ వర్కర్లు సంయుక్తంగా నిడమర్రు గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. నిడమర్రు కూడలిల్లో మానవహారంగా నిలబడి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిమ్మల పార్వతి, దేవుని విజయలక్ష్మి, టి, వెంకటలక్ష్మి, నాగమణి, ఈశ్వరి,రాజ్యలక్ష్మి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. కోన శ్రీను, వెలగలేటి మోహన్ పాల్గొన్నారు.

మహిళల నిరసన

దెందులూరు: దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఇమ్మని మణి, అధ్యక్షులు బెజవాడ పద్మ అన్నారు. బుధవారం వంగూరు గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ వద్ద మహిళలు నిరసన ధర్నా చేశారు. ఇఫ్టూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, రంగమ్మ, ఆలీశమ్మ, చిన్న రాణి, బేబి, పెద్ద రాణి, సరస్వతమ్మ, సత్యవతి నాయకత్వం వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణపవరం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా ఈనెల 22వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అప్పనపేట, జల్లికాకినాడ , వెంకట్రాజపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు ఆక్వా సదస్సు

గణపవరం: ఆక్వా రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు, సీడ్, ఫీడ్‌ల నాణ్యత, వినియోగం తదితర అంశాలపై మత్స్యశాఖ, ఎంపెడా అధికారులతో గణపవరం మండల కార్యాలయంలో ఈనెల 22వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందని మత్స్యశాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆక్వా రైతులు, ఆక్వా డీలర్లు హాజరుకావాలని కోరారు.

25 వరకు డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో సెకండ్ ఫేజులో చేరేవారికి అవకాశం ఈనెల 25 వరకు ఉందని ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు బుధవారం తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ జువాలజీలో చేరాలనుకునే విద్యార్థులు కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కౌలురైతులకు కార్డుల మంజూరు కీలకం

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కౌలురైతులకు గుర్తింపుకార్డుల మంజూరు, గుర్తింపు ప్రక్రియ కీలకమని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అధ్యక్షతన వీఆర్వోలతో అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో మాట్లాడుతూ ఈ-పంట కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు ప్రక్రియను వివాదాలు తలెత్తకుండా వీఆర్వోలు అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు.

ఆక్వా సాగులో కోళ్ల వ్యర్థాలను వినియోగించ వద్దు



మాట్లాడుతున్న సీఐ రవికుమార్, ఎస్సై సుధాకర్

భీమడోలు: చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను మేతగా వినియోగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ హెచ్చరించారు. భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ కొల్లేరు పరివాహక ప్రాంతంలోని చేపల చెరువులకు నిషిద్ధ కోళ్ల మాంసపు వ్యర్థాలను మేతగా వినియోగిస్తూ పర్యావరణానికి తీవ్ర విఘాతాన్ని కలిగిస్తున్నారన్నారు. గడిచిన కొన్ని రోజులుగా మండలంలో 6 కోళ్ల వ్యర్థాల వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదుతోపాటు వాహనాలు సీజ్ చేశామన్నారు.